మినీ కథ

# దానం

కోటకొండ సత్యానంద్

బస్టాపుకు వచ్చి అరగంటయ్యింది...ఒక్క బస్సయినా రాలేదు...మా కాలనీలో ఉన్న వాళ్ళంతా దగ్గర్లోనే ఉన్న కంపెనీలో పని చేస్తున్నారు... మా ఆఫీసు ఇక్కడికి చాలా దూరం...బస్సుల కోసం చూడకుండా అందరూ నడక ప్రారంభించేసేరు...

బస్టాపులో నేనొక్కడ్నే మిగిలిపోయేను...ఆఫీసు టైము అయిపోయింది...అందుకే నాలో ఆత్రుత ఎక్కువయ్యింది.

బస్సుకోసం ఎదురు చూసి చూసి ఏదో ఆటోను ఆపి టైముకి ఆఫీసుకి వెళ్ళడం నాకు అలవాటే! కానీ ఈరోజు ఆటోలు తిరగడం లేదు...ఆటోవాళ్ళు స్ట్రైయికు చేస్తున్నారట మీటర్ చార్జి రేట్లు పెంచమని...

రాని సిటీ బస్సుకోసం ఎదురు చూడ్డం తప్ప నేను చేయాల్సింది ఇంకేమీలేదు...ఇక మేనేజరుతో తిట్లు తినడం తప్పని సరి!

నాకు విసుగ్గా ఉంది...

అంతలో దూరంనుంచి ఓ అంబాసిడర్ కారు రావడం కన్పించింది...ఆపుదామని అన్పించింది గానీ, నేను ఆపితే అది ఆగుతుందా ఏమిటి? అని అనుకున్నాను...

అందుకే ఆపడానికి నేను చెయెత్తే ప్రయత్నం చేయలేదు...

కానీ, ఆశ్చర్యం ఆ కారు నా దగ్గరే ఆగింది... ఆగిన మరుక్షణంలో డోరు కొద్దిగా తీసి వెనుక సీట్లో కూర్చున్న ముసలాయన నావైపు ఒక్క క్షణం చూసి..."ఎక్కడికి వెళ్ళాలి?" అని అడిగాడు...

అతని గొంతు మార్దవంగా ఉంది...అతని చూపు అదోలా ఉంది...

ఎక్కడికి వెళ్ళాలో చెప్పాను నేను...

"రండి..." అని డోరు పూర్తిగా తెరిచాడు...

నేనేదో అనబోయాను గానీ ఎందుకో ఏమీ మాట్లాడకుండా కార్లో కూర్చొని డోరు వేసాను... కారు స్టార్టయ్యింది...

ఒక నిముషం నేనేమీ మాట్లాడలేదు...కానీ ఏమీ మాట్లాడకపోతే బాగుండదని నేనే అన్నాను "చాలా థేంక్సండీ, ఈరోజు ఆఫీసులో ఇన్స్పెక్షనుంది... టైమ్‌కి వెళ్ళకపోతే కుదరదు..." అని.

ఆయనేమీ మాట్లాడలేదు...నేను కాసేపు ఆయనవైపు చూసాను...

అతని తల పూర్తిగా నెరిసిపోయింది...వయస్సు యాభైదాటి ఉండొచ్చు...తెల్లని లాల్చీ, పంచె...కానీ అవి బాగా నలిగిపోయి ఉన్నాయి...తెల్లని గడ్డం బాగా మాసిఉంది...కళ్ళు ఎర్రగా ఉన్నాయి...అతని ముఖం బాగా అలసిపోయినట్లుగా, అదోలా ఉంది...

"ఈ బస్సుల్తో రోజూ శ్రమేనండి...దొరికితే పావుగంట ప్రయాణమే అయినా గంటలు గంటలు నిల్చున్నా అవి మాత్రం దొరకవు..."

పొడి పొడిగా అని నవ్వేను... నా నవ్వు నాకే కృత్రిమంగా అనిపించింది...

నా మాటలకు ఆయనేమీ అనలేదు...

నేను కూడా ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాను...

ఒక రెండు నిముషాలు గడిచాక... "ఎక్కడ పని చేస్తున్నావు బాబూ?" అని అడిగాడాయన...

తల తిప్పి ఆయనవైపు చూసి సమాధానం చెప్పేను... తర్వాత పేరు, డిసిగ్నేషను, జీతం... తదితర వివరాలన్నీ అడిగాడు... అన్నింటికీ సమాధానం చెప్పేను... ఆయన్ని కూడా ఏమైనా అడుగుదామని అనుకున్నాను గానీ ఆయనే నన్ను ఏవేవో అడుగుతుండడంవల్ల నేనడిగే అవకాశం కలగలేదు... ఆయన అడిగినవాటన్నింటికీ సమాధానాలు చెప్పేసరికి మా ఆఫీసు వచ్చేసింది...

కారు దిగి ఎంతో వినయంగా కృతజ్ఞతలు చెప్పి ఆఫీసువైపుకి నడక ప్రారంభించేను... నడుస్తూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసేను... కారు వెనుక అద్దంలోంచి ఆయన నావైపే చూస్తూ కన్పించేడు...

మామూలు సమయంలో అయితే అతని గురించి చాలా ఆలోచించేవాడినే గానీ ఆఫీసులో ఇన్స్పెక్షన్ ఉండడం వల్ల ఆ విషయాన్ని వదిలేసి వడివడిగా అడుగులేసుకుంటూ ఆఫీసుకు చేరుకున్నాను...

** ** **

ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్లు వెళ్ళిపోయారు... ఈ రెండు రోజులూ వాళ్ళవల్ల తలనొప్పి కట్టేసింది... ఈ రోజు మా స్టాఫ్ అందరమూ తలమీదనుంచి ఎంతో భారం దిగిపోయినట్లుగా ఫీలౌతున్నాము...

ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్ల మెమోలో డిస్క్రిపెన్సీస్ కూడా పెద్దగా లేకపోవడంవల్ల మా అందరికీ ఆనందంగా కూడా ఉంది.

లంచ్‌కి కేంటీన్‌కు వెళ్ళబోతుంటే ప్యూను వచ్చి నాకో తెల్లని కవరు అందించాడు...లేవబోయిన వాడ్ని మళ్ళాసీట్లో చతికిల బడ్డాను...

కవరు మీద ఫ్రమ్ అడ్రస్సు లేదు...

మా స్టాఫంతా కేంటీన్‌కు వెళ్ళిపోయారు... సెక్షన్లో నేనొక్కడ్నే ఉన్నాను... టేబుల్‌కి పైగా ఉన్న ఫ్యాన్లు కలిసి చేస్తున్న చప్పుడు ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా విన్పిస్తోంది...

కవరు చించి లోపల ఉన్న తెల్లని కాగితాన్ని పైకితీసేను...దస్తూరిలో కంగారు కన్పిస్తున్నా అక్షరాలు ఒలకబోసిన ముత్యాల్లా ఉన్నాయి... దస్తూరినీ చూసి ఎవరు వ్రాసారో పట్టలేక పోయాను...చదవడం ప్రారంభించేను...


"బాబూ! ఆనంద్!

నా పేరు సీతారామయ్య...అంటే మొన్నటి రోజున నిన్ను ఆఫీసుకి...కారులో...గుర్తొచ్చా ననుకుంటా...

నాకు చాలా ఆస్తిపాస్తులున్నాయి...కానీ అవి తప్పించలేని దురదృష్టాలు కూడా ఉన్నాయి... నాలో విపరీతమైన ఆలోచనలు చెలరేగుతున్నాయి...అవి అంతులేని ఆందోళనను సృష్టిస్తున్నాయి...ఆ ఆలోచనలు డబ్బుగురించి కాదు...బంధం గురించి!

నన్ను కన్నవాళ్ళను నేను కన్నుతెరవక ముందే కోల్పోయాను...దేవుడిలాంటి ఒక వ్యక్తి దయవల్ల నేనెంతో ఉన్నతస్థితికి వచ్చాను... నా కన్నకొడుకు కూడా కన్ను తెరవకముందే తన తల్లిని కోల్పోయాడు...నా అన్నవాళ్ళు ఎవ్వరూలేని నాకు వాడొక్కడే మిగిలాడు...వాడిని చూసుకుంటూనే ఇన్నాళ్ళూ బ్రతికాను...

బాబూ! ఆరోజు బస్టాపులో ఒంటరిగా నిల్చున్న నీవు కార్లో కూర్చొని గజిబిజి ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్న నా దృష్టిలో పడే అవకాశం లేకపోయినా



ఎందుకో అనుకోకుండా నా దృష్టి నీ మీద పడింది...నీలో అసహనం, ఆత్రుత గమనించిన నేను డ్రైవర్ని మమూలుగా ఆపమన్నాను...తర్వాత నువ్వొచ్చావు...ఏదో మాట్లాడేవు...నాలో నేనే సతమతమైపోతున్న కారణంగా నేను నీ మాటల్ని అసలు వినిపించుకోలేదు... కానీ నా ఆలోచనల్లో ఒక ఆలోచన నన్ను నీతో మాట్లాడేలా చేసింది... అందుకే తర్వాత నీతో మాట్లాడేను...అలా మాట్లాడ్డానికి ఒక కారణం ఉంది...ఆ కారణంలో ఒక ఆశ ఉంది...ఎందుకో కొద్దిగా నమ్మకం కూడా ఉంది...అందులో స్వార్థం కూడా ఉందని నువ్వనుకోడానికి అవకాశం ఉంది...

ఆనంద్! నువ్వేమనుకున్నా ఈ ఉత్తరం వ్రాయడం నా అవసరాన్ని నీకు తెలియజేయడానికి... నిన్ను అర్థించడానికి...నా కొడుకును దక్కించుకోడానికి!

బాబూ! నా కొడుకు ఇంచుమించు నీ అంతే ఉంటాడు...చలాకీగా, చక్కగా తిరిగేవాడు ఓ ఆర్నెల్లుగా డీలా పడిపోయాడు... వ్యాపారాల్లో పడిపోయి వాడిలో ఆ మార్పును నేనంతగా పట్టించుకోలేదు. వాడు కూడా దాన్ని అంతగా పట్టించుకోని నాతో ఏమీ చెప్పలేదు, డాక్టర్లకు చూపించుకోలేదు...

కదలలేని స్థితిలో కళ్ళు తెరిచాం... చేతులు కాలిపోయాక ఆకులు పట్టుకున్నాం! మూత్ర పిండాలు కుళ్ళిపోయాయట నా రాజాకి...క్రొత్త మూత్రపిండాన్ని అమరిస్తేనే గానీ ప్రాణం నిలవదట! విషయం విన్న మొదటిసారి నేను గజగజా వణికి పోయాను...కళ్ళముందు చిమ్మచీకట్లు క్రమ్ముకున్నట్లు గుండెనెవరో ఉక్కు పిడికిలితో పిసికేస్తున్నట్లు అనిపించింది...

నా ప్రయత్నాన్ని నేను చేసాను...పేపర్లో ప్రకటించాను...ప్రకటనను చూసి వచ్చిన వాళ్ళను పరీక్షించి బ్లడ్ గ్రూపు, టిష్యూ మేచింగు ఇంకా ఏవేవో చెప్పి వాళ్ళు పనికిరారని అన్నారు...అడిగిన వాళ్ళల్లో ముందుకు వచ్చిన వాళ్ళు అరుదు, ముందుకు వచ్చిన వాళ్ళందర్నీ డాక్టర్లు పరీక్ష చేసి పెదవి విరిచేసారు.

బాబూ! ఈ ఉత్తరం ఎందుకు వ్రాసానో ఇప్పటికి నీకు అర్థమయ్యే ఉంటుంది...కళ్ళల్లో ప్రాణాల్ని పెట్టుకొని బ్రతుకుతున్న నా కొడుకు నవ్వుతూ నడిస్తే అప్పుడు నాకు ఇద్దరు కొడుకులు... ఒక కొడుకు నా రాజా...రెండవ కొడుకు మా బ్రతుకుల్లో ఆనందాన్ని తెచ్చిపెట్టే వ్యక్తి! నా ఆస్తి అంతా ఆ ఇద్దరిదే! ఆ వ్యక్తివి నువ్వే ఎందుకు కాకూడదు? అని అనిపించింది నాకు... అందుకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను...ఆనంద్! ఒక్కసారి క్రింద ఇచ్చిన అమెరికన్ హాస్పిటల్ అడ్రస్సుకు వచ్చి ఈ ముసలివాడి నమ్మకాన్ని నిజం చెయ్యి......

కేవలం కారులో డ్రాప్ చేసానన్న కారణంగా నిన్ను ఇంత పెద్దదానం చేయడానికి పూనుకో మంటున్నానని అనుకోకపోతే నువ్వు రావాలి! వస్తావనే అనుకుంటున్నాను...తర్వాత ఆ దేవుని దయ!

కొడుకులాంటి వాడివి...అందుకే ఏకవచన ప్రయోగం చేసాను......

ఇట్లు
సీతారామయ్య...

ఉత్తరం చదవడం పూర్తి చేసిన నేను అదోలా అయిపోయాను... ఉత్తరంలో అతనింకా ఏదో ఏదో వ్రాయాలని అనుకున్నట్లు, కంగారు కంగారుగా వ్రాసినట్లు అనిపించింది...ఏం వ్రాసినా, ఎలా వ్రాసినా ఉత్తరంలోని విషయం నాకర్థమైంది...

డబ్బు అన్నింటినీ కొనలేదు...డబ్బు కొన్నింటిని ఆపలేదు...



ఆ ముసలాయనకు తలకొరివిపెట్టే ఒకే ఒక్క కొడుకు...ఎవరికెవరు తలకొరివి పెట్టాల్సి వస్తుందో!? ఇంతకూ ఇప్పుడు నేనేం చేయాలి?

ఎంతో ఆశతో, నమ్మకంతో ఉత్తరం వ్రాసాడాయన...అతని నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండాలంటే నేను హాస్పిటల్‌కు వెళ్ళాలి... నన్ను చూసిన ఆయన ఎంతో ఆనందపడతాడు...తన కొడుక్కి ప్రాణం పోసే దేవుడ్లా కనిపిస్తాను నేనతనికి...

కానీ నేను హాస్పిటల్‌కు వెళ్ళలేను... వెళ్ళను కూడా!

నేను అన్ని విధాలా ఆ ముసలాయన కొడుక్కి మూత్రపిండం దానం చేయడానికి సరిపోయినా... నేను నా మూత్రపిండాన్నీ ఆ యువకుడికి ఇవ్వగలనా...?

ఉన్న ఒక్క మూత్రపిండాన్నీ అతనికిచ్చేస్తే...... మరి నేను?...

.........................................

*